సాక్షి ఒడిశా

శనివారం । 30 । నవంబర్ । 2024



నియమాలు పాటించాలి

ధాన్యం మండీలో నియమాలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

- 8లో▸



మాల్యవంతకు శ్రీకారం

మాల్యవంత ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కలశ యాత్ర ఘనంగా జరిగింది.

- 8లో▸



బీజేడీ బంధుమిలన్

గుమ్మా పంచాయతీలో బీజేడీ బంధుమిలన్ ఉత్సవం జరిగింది. నాయకులు పాల్గొన్నారు.

- 8లో▸

న్యూస్‌రీల్

ప్రయాణికులకు తీపి కబురు

భువనేశ్వర్: విమానాల్లో ప్రయాణించే వారికి ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని కొత్త ప్రాంతాలకు విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి డెహ్రాడూన్, లక్నో, జైపూర్, కొచ్చిన్ 4 స్వదేశీ నగరాలకు విమానయాన సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఈ సేవలను కల్పిస్తాయి. కొత్త సంవత్సరం 2025 జనవరి మొదటి వారం నుంచి విడతలుగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జనవరి 1వ తేదీ నుంచి ఇండిగో సంస్థ ఇండోర్ ప్రాంతానికి వారానికి 4 రోజులు, డెహ్రాడూన్‌కు వారానికి 3 రోజులు విమానయాన సేవలు కల్పిస్తుంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లక్నో మరియు జైపూర్ ప్రాంతాలకు వారానికి 3 రోజులు విమాన సేవలను అందజేస్తుంది. జనవరి 3వ తేదీ నుంచి స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొచ్చిన్ ప్రాంతానికి నిత్య విమానయాన సేవలను అందుబాటులోకి తెస్తుంది. ఇండోర్, డెహ్రాడున్ ప్రాంతాలకు ఇండిగో విమానం మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరుతుంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ అతి త్వరలో కొత్తగా మరో 5 స్వదేశీ నగరాలకు విమాన యాన సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. వీటిలో భాగంగా బెంగుళూరుకు జనవరి 4వ తేదీ నుంచి విమానయానం అందుబాటులోకి వస్తుంది. ఈ విమానాలు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి అర్ధ రాత్రి 12.20 గంటలకు బెంగుళూరు చేరుతుందని విమానాశ్రయం డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్ తెలిపారు.

బడులకు ఒంటిపూట సెలవు

భువనేశ్వర్: పీఎం నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాక పురస్కరించుకొని నగరంలో బడులకు ప్రభుత్వం శుక్రవారం ఒంటి పూట సెలవు ప్రకటించింది. పోలీసు డీజీ, ఐజీ జాతీయ సదస్సు పురస్కరించుకుని ప్రధాన మంత్రి, హోం శాఖ మంత్రి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర వ్యాప్తంగా భద్రతా వ్యవస్థ కట్టుదిట్టం చేశారు. నగరంలో ప్రధాన కూడలి ప్రాంతాల అనుసంధాన మార్గాల్లో రాకపోకలపై పలు ఆంక్షలు విధించారు. ఈ పరిస్థితుల్లో బడి పిల్లలకు ఇబ్బంది లేకుండా చేసేందుకు బడులకు ఒంటి పూట సెలవు ప్రకటించారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

రాయగడ: చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో ఇద్దరిని అతి దారుణంగా హత్య చేసిన ఘటనకు సంబంధించి నిందితునికి జీవిత ఖైదును విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. అడిషినల్ డిస్టిట్ మేజిస్ట్రేట్ కల్పన స్వయి ఈ కేసుకు సంబంధించి 29 మంది సాక్షులను విచారించిన అనంతరం ఈ మేరకు తీర్పునిచ్చారు. మరో రూ.ఐదువేలు చెల్లించాలని లేకుంటే మరో మూడు నెలలు అదనంగా జరిమానా చెల్లించాలన్నారు. జిల్లాలోని శెశిఖాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బొడొకొనుపాడు గ్రామంలో 2020 జూన్ 15 వ తేదీన చేతబడి చేస్తున్నారన్న ఆరోపణలపై జాదుమణి మండంగి, పొలిగా తాడింగి అనే ఇద్దరిని ప్రేమానంద మండంగి అనే వ్యక్తి అత్యంత దారుణంగా హత్య చేశాడు. ఈ మేరకు శెశిఖాల్ పోలీస్ స్టేషన్‌లో డొబొకొసుపాడు గ్రామానికి చెందిన శంకర్ కిలక ఫిర్యాదు చేశాడు. ఈ కేసుకు సంబంధించి నిందితుడు ప్రేమానంద మండంగిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నాడు ఈ కేసుకు సంబంధించి విచారించిన జడ్జి స్వయి ఈ మేరకు తీర్పును ప్రకటించారు.

కాలువలో పడిన కారు



చికిటి కాలువలో పడిన కారు

జయపురం: దొంగలు కారు దొంగిలించి పరారవుతుండగా.. ఆ కారు కాస్తా అదుపు తప్పి కాలువలో పడింది. దీంతో కారును వదిలేసి దొంగలు పారిపోయారు. జయపురం ఆదర్శ నగర్ నివాసి ఎల్.దిలీప్ గురువారం రాత్రి కారుతో తమ బంధువులను బస్టాండ్‌లో దించి తిరిగి ఇంటికి వచ్చి కారును ఇంటి ముందు పార్క్ చేశాడు. తర్వాత చూస్తే కారు కనిపించలేదు. కొంత మంది ఆదర్శనగర్ సమీపాన గల చికిటి నాళ(చికిటి కాలువ)లో ఒక కారు పడి ఉండటం చూచి వారికి తెలిపారు. దిలీప్ ఈ విషయంపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా.. దుండగులు అర్ధరాత్రి సమయంలో కారు దొంగిలించి తీసుకువెళ్తుండగా అదుపు తప్పి కారు కాలువలో పడిందని తెలిసింది.

మళ్లీ బంగాళాదుంపల సంక్షోభం



సరిహద్దు ప్రాంతంలో ఆలుగడ్డల ట్రక్కుల నిలిపివేస్తున్న దృశ్యం

- రవాణాను అడ్డుకుంటున్న పశ్చిమ బెంగాల్
- సరిహద్దులో ట్రక్కుల నిలిపివేత

భువనేశ్వర్: రాష్ట్రంలో మరోసారి ఆలుగడ్డల కొరత తలెత్తే సంకేతాలు బలపడుతున్నాయి. పొరుగు రాష్ట్రం పశ్చిమ బెంగాల్ బంగాళాదుంపల రవాణాను అడ్డుకుంటోంది. ఈ రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఆలుగడ్డల రవాణా ట్రక్కులను దారి మళ్లించేందుకు నిలిపి వేస్తున్నారు. దీంతో బేల్దా ప్రాంతంలో ట్రక్కులు బారులు తీరుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోంది. ఈ పరిస్థితిపై రాష్ట్రంలో మోహన్ చరణ్ మాఝి సర్కారు పలు రకాల సందేహాల మధ్య సతమతమవుతోంది. పశ్చిమ బెంగాలులో ఉల్లి, ఆలుగడ్డల ధరల నియంత్రణకు సీఎం మమత బెనర్జీ కట్టుదిట్టమైన ఆంక్షలు జారీ చేశారు. వెంబడి రాష్ట్రానికి ఆలుగడ్డల రవాణా కుంటుబడింది. ఇతర రాష్ట్రాలకు పశ్చిమ బెంగాలు బంగాళా దుంపల ఎగుమతిపై ఆంక్షలు విధించినట్లు సమాచారం. పశ్చిమ మెదినిపూర్ ఠాణా పోలీసులు బేల్దా, దాతన్, సోనాకోణియా నాకా ప్రాంతాల్లో ఆలు గడ్డల రవాణా ట్రక్కులను నిలిపివేస్తున్నారు. మమత బెనర్జీ మౌఖిక ఉత్తర్వులతో సరిహద్దు ప్రాంతాల సమీపంలో రాష్ట్రానికి చేరాల్సిన ఆలు గడ్డల రవాణా ట్రక్కులను అడ్డుకుంటున్నారు. ఈ పరిస్థితి నుంచి తక్షణమే ఉపశమనం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ కల్పించుకోవాలని రాష్ట్ర వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్ పండా అభ్యర్థించారు.

పెరిగిన ధరలు

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం బంగాళాదుంపల రవాణాను అడ్డుకోవడంతో రాష్ట్రంలో ఆలుగడ్డల ఆకస్మిక కొరత ధరల పెరుగుదలని ప్రేరేపిస్తోంది. రాష్ట్రంలో అతిపెద్ద బంగాళా దుంపల మార్కెట్‌గా పేరొందిన కటక్ ఛత్ర బజారులో కిలో బంగాళా దుంపల ధర హఠాత్తుగా రూ.8 పెరిగింది. ఈ పెరుగుదలతో ఈ మార్కెటులో కిలో బంగాళా దుంపల ధర రూ.35కి చేరింది. అయితే ఇదంతా అన్నాచెల్లెల వ్యూహమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో వ్యాఖ్యానించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆత్మీయ అనుబంధం వైపు పరోక్షంగా వేలెత్తి ఈ వ్యాఖ్య జారీ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే అయితే సమస్య దాటవేత వ్యాఖ్యలతో మంత్రి పబ్బం గడుపుతున్నారని బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే శారదా జెనా ఎదురుదాడికి దిగారు.

ఏనుగుకు ప్రాణభిక్ష!



ఏనుగుని సురక్షితం స్థలానికి తరలిస్తున్న దృశ్యం



కోలుకున్న గున్న ఏనుగు

కొరాపుట్: అనారోగ్యానికి గురైన గున్న ఏనుగుకు అటవీ, పశువైద్య సిబ్బంది చికిత్స చేసి ప్రాణభిక్ష పెట్టారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అడవుల నుంచి ఆరు ఏనుగుల గుంపు సరిహద్దు దాటి ఒడిశా రాష్ట్రం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ అటవీ ప్రాంతంలోకి ఇటీవల వచ్చాయి. అందులో ఓ గున్న ఏనుగుకు నోటిలో పుండు ఏర్పడడంతో ఆహారం తినలేకపోక కేవలం నీటిని మాత్రమే తాగుతుండేది. చివరకు అనారోగ్యంతో నీరసంతో సొమ్మసిల్లి పోయింది. మిగతా ఏనుగుల గుంపు పిల్ల ఏనుగును వదిలేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి వెళ్లిపోయాయి. వన్యప్రాణుల సంరక్షణలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, శ్రద్ధ చూపించే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు ఏనుగు గుంపులో ఒకటి అదృశ్యమైన విషయాన్ని గుర్తించారు. వెంటనే డ్రోన్‌లతో అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ఒక ప్రదేశంలో ఏనుగు పడి ఉండటాన్ని గమనించారు. అటవీ, పశువైద్య శాఖ బృందాలు సరిహద్దు దాటి ఒడిశా అడవుల్లోకి వచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ నుంచి పశు వైద్య నిపుణులను రప్పించారు. రెండు రోజులు రేయింబవళ్లు ఏనుగు వద్దే మకాం వేసి చికిత్స అందించారు. మిగతా ఏనుగులు గుంపు తిరిగి వచ్చి తమపై దాడి చేస్తాయనే అనుమానంతో దట్టమైన అటవీ ప్రాంతంలో భారీ భద్రత చర్యలు తీసుకొని వైద్యం అందజేయడంతో శుక్రవారం నాటికి ఏనుగు నిలబడి ఆహారం తీసుకుంది. అయితే ఈ ఏనుగు విషయంలో ఒడిశా అటవీ శాఖ నుంచి సహాయం అందలేదని విమర్శలు వెల్లువెత్తాయి.

భవన నిర్మాణ కార్మికులకు సాయం అందజేత



కార్మికుల కుటుంబాలకు చెక్కులు అందజేసిన కలెక్టర్ దాస్, జిల్లా కార్మికశాఖ అధికారి భారతీ తదితరులు

పర్లాకిమిడి: జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు సీఎం నిర్మాణ కార్మికుల కళ్యాణ యోజన పథకం కింది 374 మందికి ఒక కోటి అరవై మూడు లక్షల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో డీబీటీ ద్వారా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అందజేశారు. కార్మిక శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలతో సమావేశమయ్యారు. అనంతరం లబ్ధిదారులకు వివాహ, ప్రసూతి, మృత్యు, అంతిమసంస్కారాల నిమిత్తం 374 మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి భారతీ బెహేరా, అసిస్టెంటు కార్మిక అధికారి మదన్ మోహన్ టుడు, అమిత్ కుమార్ నాయక్, సుకాంత కుమార్ పండా, డీపీఆర్వో పాల్గొన్నారు.

పారిశ్రామిక పెట్టుబడులకు ఆమోదం



సీఎం మోహన్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరుగుతున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో విస్తృత పారిశ్రామిక విస్తరణ కోసం ఉన్నత స్థాయి క్లియరెన్స్ అథారిటీ మార్గం సుగమం చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన ఉన్నత స్థాయి క్లియరెన్స్ అథారిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో 20 పెట్టుబడి ప్రతిపాదనలకు కమిటీ అంగీకరించింది. ఈ ఆమోదంతో రాష్ట్రంలో రూ.1,36,622.24 కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక సంస్థలు ఏర్పాటు కానున్నాయి. వీటి ఏర్పాటుతో రాష్ట్రంలో 74,350 కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పలు జిల్లాలు అనేక విధాలుగా లబ్ధి పొందుతాయి.

10 జిల్లాల్లో పారిశ్రామిక విస్తరణ

గ్రీన్ ఎనర్జీ, ఉక్కు, రసాయనాలు, జౌళి రంగాల్లో పెట్టుబడులకు ఉన్నత స్థాయి క్లియరెన్స్ అథారిటీ ఆమోద ముద్ర వేసింది. దీంతో 10 జిల్లాలు పారిశ్రామిక విస్తరణకు నోచుకుంటాయి. వీటిలో జాజ్‌పూర్, ఝార్సుగుడ, ఖుర్దా, సంబలపూర్, గంజాం, కలహండి, మల్కన్‌గిరి, ఢెంకనాల్, భద్రక్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలు ఉన్నాయి. జాజ్‌పూర్ నీలాచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఎన్ఐఎన్ఎల్ ఉత్పాదన శక్తిని టాటా సంస్థ విస్తరింపజేస్తుంది. ఈ నేపథ్యంలో టాటా సంస్థ రూ.61,769 కోట్ల పెట్టుబడితో విస్తరణ కార్యకలాపాలు చేపడుతుంది. దీంతో 14 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. భారత్ కెమికల్స్ సంస్థ ఝార్సుగుడ రసాయన కార్ఖానా విస్తరిస్తుంది. ఈ సంస్థ రూ.11,782 కోట్ల పెట్టుబడితో విస్తరణకు నోచుకోవడంతో 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళా మావోయిస్టు అరెస్టు



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఐజీ, వెనుక మహిళా మావోయిస్టు అంతి మాడ్వి

మల్కనగిరి: మల్కన్‌గిరి ఎంవీ-79 పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కుర్తి అడవుల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారించగా మావోయిస్టు కార్యకలాపాల్లో ఉన్నట్లు తమ దర్యాప్తులో తేలడంతో ఆమెను అరెస్టు చేశామని కొరాపుట్ రేంజ్ డీఐజీ నీతి శేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. అదుపులోకి తీసుకున్న మహిళలను చత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ ప్రాంతం ఫుల్‌హార్ గ్రామానికి చెందిన అంతి మాడ్విగా గుర్తించామన్నారు. 2017లో మావొయిస్టు కార్యకాలాపాల్లో చేరి చురుగ్గా వ్యవహరిస్తుండేదని, అ క్రమంలో చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన పలు సంఘటనల్లో ఆమె కీలక పాత్ర పోషించిందని తెలిపారు. 2021 జూన్ నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మంప పోలీస్ స్టేషన్ పరిధిలో గల టీగలమెట్ట గ్రామం వద్ద జరిగిన కాల్పుల్లో ఆమె ప్రధాన పాత్ర పోషించినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఆయన వివరించారు. ఆమె ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రూ.2 లక్షల రివార్డు ఉందని తెలిపారు.

మో బస్సు సేవలపై ఆంక్షలు

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక పురస్కరించుకుని నగరంలో సిటీ బస్సు సేవలను నియంత్రించారు. దీని ప్రభావంతో నగరంలో మో బస్సు సేవలు ప్రభావితం అయ్యాయి. ఎయిర్ పోర్టు స్క్వేర్ నుంచి పీఎంజీ స్క్వేర్, రాజ భవన్ స్క్వేర్, రవీంద్ర మండప్ స్క్వేర్ నుంచి 120 బెటాలియన్ స్క్వేర్, జయదేవ్ విహార్ నుంచి నాల్కో స్క్వేర్ మార్గాల గుండా పోలీసు డీజీ, ఐజీ జాతీయ సదస్సుకు విచ్చేస్తున్న అతిథి, అధికార ప్రముఖులు సందర్శించనున్నారు. దీంతో ఈ మార్గాల్లో భద్రత, రక్షణ వ్యవస్థ కట్టుదిట్టం చేశారు. ప్రవేశ కూడలి ప్రాంతాల్లో వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపడతారు. ఈ పరిస్థితుల్లో నిత్యం నగర వాసులకు సేవలందించే మో బస్సు రవాణా మార్గాల్లో రాకపోకలపై ఆంక్షలు విధించారు. తాజా మార్పు చేర్పులకు సంబంధించి మో బస్సు సమాచారం కోసం ఆ సంస్థ అధికారిక వెబ్ సైటు లేదా మో బస్సు యాప్ ద్వారా తెలుసుకుని తదనుగుణంగా వినియోగదారులు రాకపోకల మార్గాలను సవరించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

విమానాశ్రయం ఏర్పాటుకు విజ్ఞప్తి



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయిడుతో తెలుగు జాతి ఐక్య వేదిక ప్రతినిధులు

భువనేశ్వర్: పశ్చిమ బెంగాల్ ఖరగ్‌పూర్ ప్రాంతంలో స్వదేశీ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని పశ్చిమ బెంగాల్ తెలుగు జాతి ఐక్య వేదిక ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో ఈ వేదిక ప్రతినిధుల బృందం భేటీ అయింది. విద్య, ఆరోగ్యం, పారిశ్రామిక, రక్షణ, భద్రతా రంగాలకు చెందిన కీలక సంస్థలు ఖరగ్‌పూర్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పని చేస్తున్నాయి. ఈ సంస్థల కార్యకలాపాల కోసం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు చేసేందుకు వీలుగా స్వదేశీ విమానాశ్రయం ఏర్పాటు ఎంతైనా అవసరమని కేంద్ర మంత్రికి లిఖితపూర్వక అభ్యర్థన పత్రం సమర్పించారు. మాతృ రాష్ట్రం నుంచి వృత్తి, ఉద్యోగం, వ్యాపార రీత్యా లెక్కకు మిక్కిలిగా తెలుగు కుటుంబాలు ఖరగ్‌పూర్ ప్రాంతంలో స్థిరపడ్డాయి. వీరంతా స్వగ్రామాల రాకపోకలకు వీలుగా రైలు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. అలాగే షాలిమార్ - చెన్నై మధ్య రాకపోకలు చేస్తున్న 12841 అప్, 12842 డౌన్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, దిఘా - విశాఖపట్నం మధ్య రాకపోకలు చేస్తున్న 22873 అప్, 22874 డౌన్ సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లను శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో నిలుపుదల సౌకర్యం కల్పించడంలో సహకరించాలని విన్నవించారు.

ఛైతీ ఉత్సవాలకు జోరుగా ఏర్పాట్లు

- 350 స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు

రాయగడ: స్థానిక గొవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో వచ్చేనెల 26వ తేదీ నుంచి ఐదు రోజులు నిర్వహించే లోకమహోత్సవం ఛైతీ ఉత్సవాల నిర్వహణకు అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం వివిధ అంశాలకు సంబంధించి పట్టణ ప్రముఖులు, కళాకారులు, విద్యావేత్తలు, అధికారులతో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చింతన్ సమావేశం హాల్‌లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి నిహారి రంజన్ కుహోరో అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా 350 స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. పల్లిశ్రీ మేళా పేరిట ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా స్టాళ్లను ఏర్పటు చేయనున్నారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రదర్శనలు స్టాల్స్‌లో ఉంచేలా చూడాలని అధికారులు సూచించారు. అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులను, చేతి వృత్తి పనుల వారిని ప్రొత్సాహించాలన్న ముఖ్యఉద్దేశంతో వారి కళాకృతులకు కూడా స్టాల్స్‌లో చోటు కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు.



సమావేశంలొ మాట్లాడుతున్న కుహోరో, పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం అడవుల్లో పెద్దపులి సంచారం



సరిహద్దుల్లో గిరిజన ప్రజలు



మోహన వద్ద పులి పాదముద్రలు పరీక్షిస్తున్న ఒడిశా అటవీ అధికారులు

పర్లాకిమిడి: గంజాం-గజపతి సరిహద్దుల్లో తిరుగుతున్న పెద్దపులి ప్రస్తుతం ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్లు గజపతి జిల్లా అటవీ అధికారి ఎస్.ఆనంద్ విలేకరులతో శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం అటవీ అధికారులు ఈ విషయాన్ని గజపతి డి.ఎఫ్.ఓ. యస్.ఆనంద్‌కు తెలియజేసినట్లు సమాచారం.

కారులో గంజాయి స్వాధీనం



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో పట్టుబడిన గంజాయి, స్మగ్లర్లు, కారుతో ఎక్సైజ్ పోలీసులు

కొరాపుట్: కారులో రవాణా జరుగుతున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఆర్ఎంసి గేటు వద్ద కొరాపుట్ జిల్లా నుంచి వస్తున్న కారుని అనుమానంతో తనిఖీ చేశారు. వెనుక సీటు కింద 20.500 కేజీల గంజాయి కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన గంజాయి స్మగ్లర్లు కైలాస్ కుమార్, ప్రశాంత్ కుమార్ సింగ్ బీఆర్ 01 బిజెడ్ 2011 నంబర్ గల కారులో ఈ గంజాయి రవాణా చేస్తున్న తెలిపారు.

సిమిలిగుడ లో టమాటా వ్యాన్‌లో..

కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని నందపూర్ రోడ్డులో బిలయి గుడ జంక్షన్ వద్ద పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టమాటా వ్యాన్‌లో ప్లాస్టిక్ ట్రేల మధ్య గంజాయి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఈ గంజాయి పట్టుబడింది.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒక ప్రయాణికుడిని స్థానిక రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన ఆదర్శ్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. బుధవారం నాడు చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి నిందితుని నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. అలెప్పీ-ధన్‌బాద్‌కు వెళ్లే రైలు గురించి ప్లాట్‌ఫారం వద్ద నిరీక్షిస్తున్న సమయంలో రైల్వే పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఆదర్శ్ బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది.



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితుడు



కొరాపుట్: సిమిలిగుడలో టమాటా వ్యాన్‌లో పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

క్లుప్తంగా

వేణుగోపాల్‌కు అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు చెందిన తహశీల్దార్ పప్పల వేణుగోపాల్‌కు ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఆయన ప్రస్తుతం కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టు భూసేకరణ విభాగంలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు మొదటి పోస్టింగ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నియామకం పట్ల జిల్లాలో రెవెన్యూ అసోసియేషన్, రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

కూర్మనాథుని సేవలో జీయర్ స్వామీ


ఆలయ సన్నిధిలో స్వామీజీ

గార : ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలో కూర్మనాథున్ని మేలుకోట ఆస్థానం నలభై ఒకటో పీఠాధిపతి యతిరాజ జీయర్ స్వామీజీ శిష్య బృందంతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధానార్చకులు సీహెచ్.సీతారామ నృసింహాచార్యులు, ఈవో గురునాథరావులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. మూలవిరాట్, లక్ష్మీదేవిని దర్శించుకున్న అనంతరం స్వామికి చిత్రపటాన్ని అందజేశారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ పరిసర ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. పలాస తహశీల్దారు కళ్యాణచక్రవర్తి నేతృత్వంలో అధికారులు పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51లో స్థలాన్ని పరిశీలించారు. పలాస కిడ్నీ ఆసుపత్రి నుంచి సూదికొండ పరివాహక ప్రాంతాన్ని సర్వేచేయించారు. కార్యక్రమంలో సర్వేయర్ గిరిప్రసాద్, ఆర్ఐ ఖగేష్‌నాయుడు, వీఆర్ఓ నౌషద్, జుబీర్, ఉషా పాల్గొన్నారు.

108లో ప్రసవం


బిడ్డతో సిబ్బంది

కవిటి: మండలంలోని కపాసుకుద్ది మత్స్యకార గ్రామానికి చెందిన నిండు గర్భిణి జి.లలితకు గురువారం అర్ధరాత్రి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. సమాచారం అందుకున్న108 సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని మార్గమధ్యలోనే ఆపి డెలివరి చేసేందుకు ప్రయత్నించారు. సమస్య తీవ్రం కావడంతో ఈ.ఎం.టి.కృష్ణారావు, ఈ.ఆర్.సి.పి డాక్టర్ సందీప్ సూచనలతో జాగ్రత్తగా ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం ఇచ్ఛాపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

పేకాట శిబిరంపై దాడి

నరసన్నపేట: మండలంలోని దేవాది సమీపంలో వల్లభరాయునిపేట చెరువు గట్టు వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం ఉదయం సీఐ జె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని పట్టుకుని వారి నుంచి రూ.87,100 నగదు, రెండు కార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో అయ్యప్ప భక్తుడు మృతి

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని కుద్దిరాం గ్రామానికి చెందిన బండి అనంతరావు(50) అనే రైతు పాముకాటుతో మృతి చెందాడు. అనంతరావు అయ్యప్పస్వామి మాల ధరించాడు. గురువారం తన వరి పొలంలో యంత్రంతో కోత కోసేందుకు ఒక్కడే వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. సాయంత్రం రావికండిపేటలోని సన్నిధానానికి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. శుక్రవారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో పొలానికి వెళ్లి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. కాలుపై పాము కాటు వేసిన గుర్తులు ఉండటంతో మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు తెలియజేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అనంతరావుకు భార్య అన్నపూర్ణమ్మ, కుమారుడు సాయి, కుమార్తె ప్రియాంక ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


కోరుకొండలో పూజల్లో పాల్గొన్న వేదబద్ ప్రదాన్

మాల్యవంత మహోత్సవాలకు శ్రీకారం


కోరుకొండలో కలశాలు


నది వద్ద మాల్యవంత పేరు


నృత్యం చేస్తున్న జిల్లా పౌరసంబంధాల శాఖ అధికార సిబ్బంది

మల్కనగిరి: ఏటా వైభవంగా జరిగే మాల్యవంత మహోత్సవాలకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. డిసెంబర్ 13 నుంచి 17 వ తేదీ వరకు జిల్లాస్థాయి మాల్యవంత ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలోని కోరుకొండ వద్ద గల జలేశ్వర్ నది వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజల్లో జిల్లా అదనపు కలెక్టర్ వేదబద్ ప్రధాన్ పాల్గొన్నారు. ముందుగా నది వద్ద నిర్వహించిన పూజల అనంతరం నదిలో గల శుద్ధ నీటిని కలశాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి జగన్నాథ మందిరం వద్ద నిలిపారు. ఈ కలశ యాత్రలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. డిసెంబరు 13న జరగనున్న మహోత్సవాలకు సంబంధించి జగన్నాథ మందిరం వద్ద భద్రపరిచిన శుద్ధ జలాలను వేదిక వద్దకు తీసుకువెళ్లడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కలశ యాత్రలో భాగంగా ఆదివాసీల సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ప్రాంతం సందడిగా మారింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి తంగుల్, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖిలా, ఏడీఎం సామనాథ్ ప్రధాన్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి నరేష్ చంద్ర సబర్, జిల్లా సంస్కృతి విభాగం అధికారి సంత్రాస్ నారాయణ పండ, అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


నృత్యాలు


కలశ యాత్రలో మహిళలు

ఆక్రమణ తొలగించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన గ్రామస్తులు

జయపురం: ఇంటి పట్టాను పరిశీలించిన తరువాత ఆక్రమణ జరిగినట్టు నిర్ధారణ జరిగితే వాటిని తొలగించాలని జయపురం సమితి హారడాపుట్ గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు జయపురం తహసీల్దార్ను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రముఖ సమాజ సేవకులు బి.హరిరావు నేతృత్వంలో గ్రామస్తులు అధికారులను కలిశారు. ఎనిమిదేళ్ల కిందట హారడాపుట్‌లోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) కార్యాలయంలో నాలుగో శ్రేణి ఉద్యోగి ఉండేవాడని.. అతడిది బొయిపరిగుడ సమితి కెందుగుడ గ్రామం అని వెల్లడించారు. అతడు తమను కలసి గ్రామంలో చిన్న ఇల్లు కట్టుకుని ఉంటానని, కార్యాలయంలో ఉన్నంత వరకు ఉండి తరువాత ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతానని చెప్పినట్టు వివరించారు. దీంతో తాము అందుకు అనుమతించటంతో అతను ఇల్లు నిర్మించుకున్నట్టు పేర్కొన్నారు. తరువాత ఆ వ్యక్తి ఆ స్థలాన్ని తన భార్యపేరున పట్టా చేయించాడని తెలిసిందని గ్రామస్తులు వెల్లడించారు. ఆ స్థలం ఖాళీ చేయమని అడుగగా ఆ స్థలం తనదని.. తన వద్ద పట్టాకూడా ఉందని అంటున్నాడని వెల్లడించారు. అతడు రిటైర్ అయినా కూడా ఆ స్థలం విడిచి పెట్టటం లేదని వారు ఆరోపించారు. అనంతరం ఆ ఇల్లు అద్దెకు ఇచ్చి అతడు వెళ్లి పోయినట్టు పేర్కొన్నారు. ఆక్రమించిన స్థలం ఆదివాసీ సమాజ్ కార్యాలయం నిర్మించేందుకు కేటాయించారన్నారు. ఆ కార్యాలయ నిర్మాణానికి రూ. నాలుగు లక్షలు నిధులు మంజూరయ్యాయవన్నారు. పట్టా రద్దు చేసి ఆక్రమణను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారని సమాజ సేవకుడు బి.హరిరావు వెల్లడించారు.

మండీల్లో నియమాలు పాటించాలి: సబ్ కలెక్టర్


రైతు సచేతన రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్, ఆర్ఎంసీ డైరెక్టర్లు


సచేతన రథం కార్యక్రమంపై మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శోశ్యా రెడ్డి

జయపురం: ధాన్యం మండీల్లో రైతులు నిబంధనలు పాటించాలని జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె ఆర్ఎంసీ డైరెక్టర్ దేవేంద్ర బాహిణీపతిలు జెండా ఊపి రైతు సచేతన రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సచేతన రథం ద్వారా రైతులు అమ్మకానికి తీసుకు వచ్చే ధాన్యం నాణ్యత కలిగి ఉండాలని, మండీల్లో ధాన్యం అమ్మేందుకు తీసుకువచ్చే రైతులు మండీ నియమాలు పాటించాలని ఈ రథం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ రథం జయపురం సబ్‌డివిజన్‌లో జయపురం, బొరిగుమ్మ, జయపురం, కొట్‌పాడ్, కుంధ్ర, బొయిపరిగుడ సమితుల్లో పర్యటిస్తుందన్నారు. ఎఫ్ఎక్యూ నాణ్యత గల ధాన్యం మండీలకు తీసుకు రావాలని, వారపు సంతల్లో ధాన్యం క్రయవిక్రయాలు బంద్ చేయాలని, రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్‌లతో మండీలకు రావాలని, టోకెన్ కాలపరిమితి 30 దినాలు ఉంటుందని, ధాన్యం మండీలకు తీసుకు వచ్చేందుకు గుర్తింపు ఉన్న రైతులకు ధాన్యం మండీలకు ఎప్పుడు తేవాలో మొబైల్ ఫోనుల ద్వారా తెలియజేస్తామని, ఆ తేదీల్లో తీసుకువస్తే ఒక పత్రం అందిస్తామన్నారు. టోకెన్ గల రైతుల ధాన్యాన్నే మండీల్లోనికి అనుమతిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎస్ఓ సునీల్ కుమార్ జెన, సీఎస్ఓ సర్వేశ్వర నాయిక్, ఆర్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న పలువురు అరెస్టు


పట్టుబడిన డ్రంకర్లు


సైలెన్సర్లు తొలగించిన బైక్‌లు

జయపురం: జయపురం పట్టణంలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం తాడడంతోపాటు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ శబ్ధ కాలుష్యం సృష్టిస్తున్న వారిపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి ప్రత్యేక దాడులు చేపట్టి తొమ్మిది మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వారిని అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి శుక్రవారం వెల్లడించారు. గాంధీ జంక్షన్ నుంచి జేఈఎల్‌సీ కూడలి మధ్య అరెస్టు చేసిన డ్రంకర్ల నుంచి రూ.16 వేలు జరిమానా వసూలు చేసినట్టు పేర్కొన్నారు. ప్రొహిబిషనరీ ఐపీఎస్ అధికారి మారుతీ శివా రెడ్డి, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి, పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో వీరు పట్టుబడ్డారన్నారు. అలాగే అధిక సబ్దంతో వాహనాలను నడుపుతున్న ఎనిమిది బైకులను సీజ్ చేసి సైలెన్సర్లను తొలగించారు. వారి వద్ద నుంచి రూ. 2,86,000 జరిమానా వసూలు చేశామన్నారు.

గుమ్మలో బీజేడీ బంధుమిలన్ ఉత్సవం


గుమ్మా గ్రామంలో బిజేడీ బంధుమిలన్ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రూపేష్‌కు ఆహ్వానం పలుకుతున్న పార్టీ నాయకులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా గ్రామం సంతపేట వద్ద గుమ్మా బ్లాక్ బీజేడీ బంధుమిలన్ కార్యక్రమం శుక్రవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పాల్గొనగా, బీజేడీ జిల్లా అధ్యక్షులు జగబంధు దాస్, డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస రావు, సీనియర్ నాయకులు జేమ్స్ రైకా, పట్టణ అధ్యక్షులు సుధీర్ రంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాణిగ్రాహి మాట్లాడుతూ, గుమ్మా బ్లాక్ బీజేడీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేసి వచ్చే పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. గుమ్మాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఈ బంధుమిలన్ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ వార్డు సభ్యులు రోహెల్ పాణి తదితరులు బీజేడీ పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమాన్ని గుమ్మా బీజేడీ యువజన అధ్యక్షులు నీరజ్ కుమార్ షడంగి పర్యవేక్షించారు.


సీనియర్ బిజేడీ నాయకులు తిరుపతి పాణిగ్రాహి


బీజేడీ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి


గుమ్మాలో బంధుమిలన్ కార్యక్రమానికి విచ్చేసిన బీజేడీ సర్పంచులు, సమితి సభ్యులు, కార్యకర్తలు



ఎదురుచూపులకు ఏడాది!

- కొలిక్కి రాని గార ఎస్‌బీఐ బంగారం స్కామ్
- నేటికీ ఖాతాదారులకు చేరని రికవరీ బంగారం
- కొనసాగుతున్న విచారణ

శ్రీకాకుళం క్రైమ్:

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార ఎస్‌బీఐ స్కామ్ వెలుగుచూసి ఏడాది పూర్తయినా కేసు కొలిక్కి రాకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.4.7 కోట్ల విలువైన 7.146 కిలోల తనఖా బంగారాన్ని బ్యాంకుకే చెందిన అధికారులు, సిబ్బంది మాయం చేశారన్న ఆరోపణలు రావడంతో అనేక నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు అప్పట్లోనే బంగారాన్ని రికవరీ చేశారు. అయినా ఇప్పటికీ ఆ బంగారం ఖాతాదారులకు చేరకపోవడం గమనార్హం. అప్పట్లో ప్రారంభమైన దర్యాప్తు సగంలోనే ఆగిపోవడం, మరళా రీ-ఇన్వెస్టిగేషన్ ప్రారంభమైనా ఇంకా కొలిక్కిరాకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ విషయం..

గతేడాది నవంబరు 23న గార ఎస్‌బీఐ క్యాషియర్ ముంజి సురేష్‌పై దాడి జరిగింది. అయితే బ్యాంకులో తనఖా బంగారం మాయం చేసిన విషయం బయటకు పొక్కుతుందేమోనని బ్యాంకు అధికారి స్వప్నప్రియే దాడి చేయించిందంటూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆ మరుసటి రోజు (24)న ఫిర్యాదు చేశాడు. అనంతరం బంగారం మాయం కేసులో స్వప్నప్రియే ప్రధాన నిందితురాలు అని దుష్ప్రచారాలతో కూడిన కథనాలు రావడంతో అవమాన భారంతో 29న ఆమె ఆత్మహత్య చేసుకుంది. దీంతో అప్పటివరకు బంగారం మాయమవ్వలేదని బీరాలు పలికిన బ్యాంకు అధికారులు, ఆ మరుసటి రోజే తనఖా బంగారం మాయమైందని, చనిపోయిన స్వప్నప్రియ, ఆమె సోదరుడిపైన ఫిర్యాదు చేశారు. తర్వాత అప్పటి ఎస్పీ రాధిక సమక్షంలోని పోలీసులు రంగప్రవేశం చేసి విచారణలో తొమ్మిది మంది నిందితులను గుర్తించి డిసెంబరు 8న ఏడుగురిని అరెస్టు చేసి బంగారాన్ని రికవరీ చేసి కోర్టుకు అప్పగించారు. అయితే ఆ కుంభకోణంలో తమ కుటుంబాన్ని ఇరికించారని, కుమార్తె ప్రాణాన్ని బలిగొన్నారని స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళ



గార ఎస్‌బీఐ కార్యాలయం



బాధితుల ఆందోళన..

పోలీసులు రికవరీ చేసిన తమ బంగారాన్ని ఇప్పటివరకు బ్యాంకు వారు అందివ్వలేదని, దీనికితోడు వడ్డీలు కట్టాలంటూ మెసేజ్‌లు, ఫోన్‌లు వస్తుండటంతో ఇటీవల బాధితులు ఆందోళన చేపట్టారు. వాస్తవానికి పోలీసులు రికవరీ చేసిన బంగారం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున అవి బ్యాంకు సేఫ్‌లో ఉన్నట్లేనని, బంగారం ఇప్పించే బాధ్యత తమదేనని.. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్‌బీఐ వర్గాలంటున్నాయి. తాజాగా దీనిపై బ్యాంకు అధికారులు న్యాయ సలహాదారుల సమక్షంలో ఖాతాదారులతో సమావేశమై ఈ విషయం చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాజును విధుల నుంచి తొలగించాలి

- నా కుమార్తెలా ఎంతోమంది ప్రాణాలు పోతాయి
- ప్రస్తుత ఆర్ఎంకు వినతిపత్రం అందించిన స్వప్నప్రియ తల్లి

శ్రీకాకుళం క్రైమ్: గతేడాది నవంబరులో గార ఎస్‌బీఐ బ్రాంచిలో నగలు మాయమవ్వడం వెనుక అప్పటి జిల్లా రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజు పాత్ర ఉందని, బ్యాంకు అధికారులను తప్పుదోవ పట్టించిన ఆయన్ను విధుల నుంచి తొలగించాలని ఆత్మహత్యకు పాల్పడిన బ్యాంకు ఉద్యోగిని ఉరిటి స్వప్నప్రియ తల్లి సరళ కోరారు. స్వప్నప్రియ చనిపోయి ఏడాది కావడంతో ఆమె శుక్రవారం ఉదయం జిల్లాకేంద్రంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న శ్రీకాకుళం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ వ్యాపార కార్యాలయంలో ప్రస్తుత రీజనల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎక్స్ ఆర్ఎం రాజును బర్తరఫ్ చేయాలంటూ కార్యాలయం బయట ప్లకార్డు ప్రదర్శించారు. ఆమె వెంట బంధువులు ఉన్నారు.

వినతిపత్రంలో ఏముందంటే..

'ఎస్బీఐలో క్లర్క్ ఉద్యోగం చేస్తున్న స్వప్నప్రియకు పదోన్నతి రావడంతో 2022లో గార బ్రాంచిలో డిప్యూటీ మేనేజరుగా పోస్టింగ్ ఇచ్చారు. 2023 నవంబరులో బ్యాంకు లాకరులో ఉన్న బంగారు నగలు మాయమైతే. అప్పటి రీజనల్ మేనేజ్ ఎటువంటి ఆధారాలు లేకుండా స్వప్నప్రియ మీద ప్రచారం చేయడంతో పాటు పత్రికలు, సోషల్ మీడియాకు సమాచారం అందించారు. దీంతో మనస్థాపానికి గురై అదే నెల 29న స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుంది. చనిపోయిన తర్వాత కూడా ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు నా కుమారుడిని పోలీసులు నిందితుడిగా చూపించి రిమాండ్‌కు పంపించారు. బంగారం పోయిందంటూ ఆరోపణలు వచ్చిన నెలరోజుల ముందే ఆడిట్ జరిగిందని, అంతా సవ్యంగానే ఉందని చెప్పిన ఆర్ఎం రాజు స్వప్నప్రియ చనిపోయాక ఆమెపై మాత్రమే నింద నెట్టి మిగతా వారిని రక్షించారు. ఆమె దహన సంస్కార ఖర్చులు సైతం ఇప్పించలేదు. కనీసం సహచర సిబ్బంది పరామర్శించడానికి వస్తామన్నా రానివ్వలేదు. మా కుటుంబాన్ని హింసించి, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా చితికి పోయేలా పరిస్థితి తీసుకొచ్చిన ఆర్ఎం రాజు ఇప్పటికీ విధుల్లో కొనసాగితే స్వప్నప్రియ మాదిరి ఎంతో మంది ఉద్యోగుల ప్రాణాలు పోతాయి..' అని సరళ పేర్కొన్నారు.

జాతీయ మానవహక్కులు, మహిళా కమిషన్, ప్రస్తుత హోంమంత్రి, సీఎంవో కార్యాలయాలకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు కథ మళ్లీ మొదలైంది. కుంభకోణం చేయించింది అప్పటి రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజేననని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కొత్త ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి రంగంలోకి దిగి డీఎస్పీ వివేకానందతో రీ-ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టించారు. దీనిలో భాగంగా ఇప్పటికే 15 మందికి పైగా అనుమానితులను పోలీసులు పలుమార్లు పిలిచి విచారించడం, నివేదికలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు (ఎస్పీ, డీఐజీ, ఐజీ స్థాయి) చేరవేశారు.

క్లుప్తంగా

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన


స్వర్ణపుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ నేతృత్వంలో వేకువజాము నుంచి అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కందివలసలో ఏనుగుల సంచారం


కందివలస టమాటో తోటల్లో గజరాజుల గుంపు

కొమరాడ: మండల ప్రజలు, రైతులను గజరాజుల బెడద వీడడం లేదు. పగటి పూట ఆర్తాం కొండ ప్రాంతానికి చేరుకుని విశ్రాంతి తీసుకుని రాత్రి పూట కుమ్మరిగుంట పంటపొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు గడిచిన రెండు రోజులుగా కందివలస గ్రామంలోకి చొరబడ్డాయి. గ్రామ పరిసరాల్లో ఉన్న పామాయిల్, మోటార్ డ్రిప్ పరికరాలు, టమాటో తోటలు తొక్కుతూ జంఝావతి డ్యాం గట్టు దాటుకుని కోనవలస, లక్ష్మీపేట కొండ ప్రాంతానికి చేరుకున్నాయి. దీంతో రాజ్యలక్ష్మీపురం, కంబవలస, కందివలస తదితర గ్రామాల ప్రజలు గజరాజుల గుంపు ఏరాత్రి వచ్చి గ్రామంలోకి చొరబడతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం గడపుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ట్రాకర్స్ ఏనుగులు సంచారంపై కచ్చితమైన సమాచారం ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సౌత్‌వెస్ట్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రిఫరీగా వెంకటేష్

బొండపల్లి: సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రిఫరీగా వ్యవహరించే అవకాశం బొండపల్లి మండలంలోని అంబటివలస గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ పాలూరి వెంకటేష్‌కు లభించింది. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రిఫరీగా వెంకటేష్‌ను ఎంపిక చేయడంతో ప్రస్తుతం యూనివర్సిటీలో జరుగుతున్న పురుషుల విభాగంలో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు రిఫరీగా ఆయన వ్యవహరిస్తున్నారు. మారుమూల ప్రాంతం నుంచి వెయిట్ లిఫ్టర్‌గా ఎదిగి అనేక పతకాలు సాధించి ఇప్పుడు రిఫరీగా వ్యవహరిస్తుండడంతో గ్రామస్తులు అభినందిస్తున్నారు.

నాటుతుపాకీతో కాల్పులు జరిపిన వ్యక్తి అరెస్టు

సీతంపేట: మండలంలోని దుగ్గి గ్రామంలో నాటుతుపాకీతో కాల్పులు జరిపి ఓ వ్యక్తిని గాయపర్చిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన కొండగొర్రె రాజేష్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు. తుపాకీ కాల్పుల్లో గాయపడిన లక్కాయి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం జి.శివడ గ్రామానికి చెందిన దేవరాపు త్రినాథం (54) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు తెలిపిన వివరాల మేరకు గురువారం సాయంత్రం గ్రామం సమీపంలో పొలం పనులు చేస్తుండగా పాము కరిచిందని, ఇంటికి వచ్చాక కుటుంబసభ్యులకు తెలియపర్చగా..వెంటనే గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స అందిస్తుండగా రాత్రి మృతిచెందాడు. పాముకాటుకు గురైన తర్వాత ప్రాథమిక చర్యలేవీ చేపట్టలేదని, ఆస్పత్రికి వచ్చే లోపే విషం శరీరమంతా పాకిందని, వైద్యం అందించినా ఫలితం లేకుండా పోయిందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రమణమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఏఆర్ డీఎస్పీకి బదిలీ

పార్వతీపురంటౌన్: జిల్లా ఏఆర్ డీఎస్పీ వెంకట అన్నారావును బదిలీచేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా నుంచి కె.థామస్ రెడ్డిని నియమించింది. బదిలీపై వెళ్తున్న అన్నారావును ఎస్పీ ఎస్.వి. మధవ్‌రెడ్డి, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్ అభినందించారు.

మహిళా మణులకు సెల్యూట్..!

- మహిళల కన్యాశుల్కం నాటిక ప్రదర్శనకు అపూర్వ ఆదరణ
- రాష్ట్రస్థాయిలో పలు ప్రదర్శనలు
- మహాకవి గురజాడ వర్ధంతి నేడు


కన్యాశుల్కం నాటికలో మహిళా నటులకు సూచనలు చేస్తున్న దర్శకుడు


మహిళల కన్యాశుల్కం టీమ్

విజయనగరం టౌన్: వందేళ్ల క్రితమే మహాకవి ముందుచూపు చూశారు. సమాజంలోని దుర్గతలను, సాంఘిక దురాచారాలను తనదైనశైలిలో రచించారు. నాటికీ నేటికీ మహాకవి గురజాడ భావితరాలకు అడుగుజాడగా నిలిచారు. ఆయన రూపొందించిన కన్యాశుల్కం నాటిక అజరామరంగా నిలబడిందంటే ఆ మహనీయుని దార్శనికత వర్ణనాతీతం. అటువంటి కన్యాశుల్కం నాటిక ప్రదర్శనను విజయనగరం గడ్డపైన మహిళలు ప్రదర్శించడం ప్రపంచ చరిత్రలో లిఖించగిన అంశం. కన్యాశుల్కం నాటకాన్ని ఎంతోమంది కళాకారులు తమ హావభావాలతో ప్రదర్శించినప్పటికీ, మహిళలు ముందుకు వచ్చి కేవలం మహిళలతోనే కన్యాశుల్కం నాటిక ప్రదర్శించడం చాలా క్లిష్టతరమైనపని. అటువంటిది లేడీస్ క్లబ్, రిక్రియేషన్ క్లబ్ మెంబర్‌గా ఉంటూ గురజాడ సాంస్కృతిక సమాఖ్యలో సేవలందిస్తున్న భోగరాజు సూర్యలక్ష్మికి వచ్చిన ఆలోచనతో దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన ఈపు విజయకుమార్ నేతృత్వంలో నాటకం ఊపిరిలూదుకుంది.


మధురవాణి ఇంట్లో మంచం సీన్ (ఫైల్)

దీంతో తొలిసారిగా 2017లో ఐదుగురితో కలిసి 40 నిమిషాల పాటు ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. అక్కడితో ఆగిపోకుండా రాష్ట్రస్థాయిలో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. 2019లో సెప్టెంబరు 21న గురజాడ జయంతి రోజున ఆ మహాకవి పుట్టిన ఊరు ఎస్.రాయవరంలో మహిళలు కన్యాశుల్కం నాటిక ప్రదర్శించి మహాకవికి ఘనంగా నివాళులర్పించారు. విజయనగరం, బొబ్బిలి, కాకినాడ, గుంటూరు, భీమవరం, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లో కన్యాశుల్కం నాటిక ప్రదర్శించి



గిరీశం పాత్రధారిలో వెంకటేశానికి సూర్యలక్ష్మి ధైర్యం చెబుతున్న దృశ్యం (ఫైల్)

ఆహూతుల మన్ననలు పొందారు. తాజాగా శుక్రవారం కాకినాడలో రెండు గంటల నిడివిలో కన్యాశుల్కం నాటిక ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయస్థాయిలో దేశవ్యాప్తంగా మహిళలు కన్యాశుల్కం నాటిక ప్రదర్శన తమ లక్ష్యమని, మహాకవి గురజాడను విశ్వవ్యాప్తం చేస్తామని మహిళలు ఘంటాపథంగా చెబుతుండడం విశేషం. అదేవిధంగా గతంలో కేవలం బొంకులదిబ్బ, అగ్నిహోత్రావధానుల సీన్‌లు వేసేవారు. నేడు రెండు గంటల నిడివిలో బొంకులదిబ్బ, మధురవాణి ఇంట్లో మంచంసీన్, అగ్నిహోత్రావధానుల ఇంట్లో తాంబూలాలిచ్చేశాం..తన్నుకు చావండి' అనే సన్నివేశాలను, సౌజన్యరావు పంతులు ఇంట్లో పడక గది సీన్‌తో పాటు మరికొన్నింటిని నాటకంగా ప్రదర్శించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పాత్రధారులు వీరే..

కేవలం 40 నిమిషాల నిడివిలో రెండు సన్నివేశాలను మాత్రమే ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందిన మహిళలందరూ నేడు ఒకడుగు ముందుకేసి రెండు గంటల పాటు ప్రదర్శన ఇవ్వడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. వయోవృద్ధులైన మహిళలు సైతం కీలకపాత్రలు పోషిస్తూ మన్ననలు పొందుతున్నారు. గిరీశంగా భోగరాజు సూర్యలక్ష్మి, రామప్ప పంతులుగా సీహెచ్.రాజకుమారి, కరటక శాస్త్రిగా ముళ్లపూడి సుభద్రాదేవి, అగ్నిహోత్రావధానులుగా సామవేదుల గీతారాణి, పూటకూళ్లమ్మ, ఫొటోగ్రాఫర్ పంతులు నౌకరుగా సామవేదుల సత్యలత, వెంకమ్మగా ఉదయగిరి నీలిమ, మధురవాణిగా సీతామహాలక్ష్మి, సౌజన్యారావు పంతులుగా చీకటి చంద్రికారాణి, వెంకటేశంగా వాకా దేదీప్య పాత్రలను పోషిస్తున్నారు. ఆర్గనైజర్‌గా భోగరాజు సూర్యలక్ష్మి, దర్శకత్వం, నిర్వహణ బాధ్యతలు ఈపు విజయకుమార్ నిర్వహిస్తున్నారు.


కన్యాశుల్కం అజరామరం



130 ఏళ్ల క్రితమే దురాచారాలపై నాటకం రాసి గురజాడ సామాజిక విప్లవం సృష్టించారు. విజయసూర్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలతో నాటికను ప్రదర్శించడం ఎంతో ఆనందదాయకం. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ అందిస్తున్న సహకారం ఎనలేనిది. మహాకవి నడయాడిన నేలపై ఆయన సాహితీ వారసులుగా మహిళలతోనే చేపట్టే ఈ కన్యాశుల్కం నాటకం దేశమంతా ప్రదర్శించాలన్నదే మా లక్ష్యం.

– ఈపు విజయకుమార్, దర్శకుడు, విజయనగరం

కుటుంబ సభ్యుల సహకారం ఎనలేనిది




మహాకవి గురజాడ రచించిన కన్యాశుల్కం నాటిక మహిళలతో ప్రదర్శింపు చేయాలన్న సంకల్పం సత్ఫలితాలనిచ్చింది. నా భర్త భోగరాజు బాబూజీ సహకారంతో నా పెద్దకుమారుడు భోగరాజు కొండిన్య చిన్నతనంలో గొల్లపూడి మారుతీరావు, రావికొండలరావులతో కలిసి కన్యాశుల్కం నాటకంలో వెంకటేశంగా నటించాడు. మా చిన్నవాడు శాండిల్య లుబ్ధావధానులుగా ఏకపాత్రాభినయం ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు. ఆ కోవలోనే మహిళలతో కన్యాశుల్కం నాటిక ప్రదర్శింపజేయాలనే ఆలోచన నాకు తట్టడం, రాష్ట్రస్థాయిలో ప్రదర్శనలిస్తుండడం మహాకవి సాహితీవారసులుగా నడవడం ఆనందంగా ఉంది. మహిళల కన్యాశుల్కంలో గిరీశంగా నటిస్తుంటే చెప్పలేనంత సంతోషం కలుగుతోంది.

– భోగరాజు సూర్యలక్ష్మి, ఆర్గనైజర్, విజయనగరం

అదానీపై చర్యలకు తాత్సారం ఎందుకు?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ కొనుగోళ్లపై ప్రజలందరూ చర్చించుకుంటున్నా, తమకేమీ తెలియదన్నట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారని, సమాచారం సేకరిస్తున్నామంటూ బుకాయిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. విజయనగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల ఆదేశాలతో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం, దానికి తొత్తులుగా ఉన్న కూటమి ప్రభుత్వాలు అదానీ విషయంలో చర్యలకు కావాలనే తాత్సారం చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీతో అంటకాగడం వల్లే అదానీకి మద్దతుగా విద్యుత్ కొనుగోళ్లపై చంద్రబాబు స్పందించడంలేదన్నారు. సెకీతో విద్యుత్ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం పడుతుందని సీపీఐ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై చివరకు తాను హైకోర్టులో రిట్ వేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం ఆర్థికమంత్రిగా ఉన్న పయ్యావుల కేశవ్ కూడా కోర్టులో పిల్ దాఖలు చేశారని తెలిపారు. కోర్టులో కేసు వేయడంతో అజీజ్ పవార్ కంపెనీ విద్యుత్ సరఫరాలో వెనక్కి తగ్గిందన్నారు. అదానీ మాత్రం దాదాపు 7 వేల మెగా వాట్ల విద్యుత్ సరఫరా చేసి రాష్ట్ర ప్రజలపై ఒక లక్షా పదివేల కోట్లు భారాన్ని వేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఆధారాలు లభించినా ముఖ్యమంత్రి ఆలోచన చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య సారథి గురజాడ


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: గురజాడ అప్పారావు అభ్యుదయవాది, తెలుగు సాహిత్య సారథి. కన్యాశుల్కం పేరుతో జరుగుతున్న సాంఘిక దురాచారపు వికృత రక్కసి కోరల నుంచి ఆడవారిని కాపాడారు. సంఘంపై సమర శంఖాన్ని గురజాడ పూరించగా చీకటి తెరలు తొలగిపోయి జ్ఞానకిరణాలు ఉత్తేజితమయ్యాయని జిల్లా పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గురజాడ పేరు తలుచుకున్నప్పుడల్లా నరనరాల్లో మానవత్వం పొంగి మానవతా వాదాన్ని మనసు నిండిస్తుందన్నారు. సమితి అధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి వెలుగుజాడ గురజాడ రాసిన గీతం 'దేశమును ప్రేమించుమన్నా కొన్ని కోట్ల తెలుగుప్రజల పెదాలపై కోట్లసార్లు నర్తించి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముందుగా గురజాడ చిత్రపటానికి అంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులను, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ మిషన్ సేవలు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్


విద్యార్థులకు బహుమతి ప్రోత్సాహకాలను అందిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం రూరల్: లెప్రసీ మిషన్ సమాజానికి అందిస్తున్న సేవలు పలువురికి స్ఫూర్తి దాయకమని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రశంసించారు. ఈ మేరకు విజయనగరం మండలంలోని చెల్లూరు గ్రామ సమీపంలో ఉన్న లెప్రసీ మిషన్ 150వ వసంత వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ అక్కడ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు.అలాగే వారు రూపొందించిన వివిధ కళాకృతులను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ లెప్రసీ మిషన్ సేవలను వందేళ్లకు పైగా కొనసాగించడం అభినందనీయమన్నారు. ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఈ సంస్థ సేవలు మరింత మరింత ముందుకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ కె.రాణి, సంస్థ ప్రిన్సిపాల్ గాబ్రియేల్, ఇతర ప్రతినిధులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ


స్వామి వారి సన్నిధిలో సహస్ర దీపారాధన కార్యక్రమం

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతా రామస్వామివారి దేవస్థానంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం కనుల పండువగా సాగింది. కార్తీక శుక్రవారం సందర్భంగా సాయంత్రం స్వామివారి ఆస్థాన కల్యాణ మంటపంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ముందుగా స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేపట్టారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుము కల్యాణ మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో స్వామివారిని వేంచేపు చేసి ఊంజల్ సేవను వైభవంగా జరిపించారు. భక్తులే స్వయంగా స్వామివారికి దీపాలంకరణ సేవ చేసే భాగ్యం కలగడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సహస్ర దీపాలను వెలిగించారు.

అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సినీఫక్కీలో చోరీ

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారంలో ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం సినీఫక్కీలో చోరీ జరిగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొట్నేలు సూర్యకుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ అగంతుకుడు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న తులం బంగారం, రూ.10 వేలు, సెల్‌ఫోన్ దొంగిలించినట్లు బాధితులు తెలియజేశారు. సూర్యకుమార్ పరిశ్రమలో విధులకు వెళ్లిపోగా, భార్య జానకి గ్రామం సమీపంలో గల శివాలయంలో అన్నదానం కార్యక్రమానికి వెళ్లిన సమయంలో ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితులు తెలియజేశారు. అగంతుకుడు ఆ ఇంట్లో ఉన్న సమయంలోనే పెండ్లికార్డుతో ఆహ్వానించేందుకు సూర్యకుమార్ బంధువులు వచ్చారు. వారిని అగంతుకుడు తప్పుదోవ పట్టించి, ఇంటి గల వ్యక్తులకు ప్రమాదం జరిగిందని తెలియజేయడంతో అక్కడి నుంచి బంధువులు వెళ్లిపోయారు. దీంతో అగంతుకుడు పరారయ్యాడు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పూసపాటిరేగ పోలీసులు సందర్శించి విచారణ చేపట్టారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


జావెలిన్ త్రో


పరుగుపోటీలో మహిళా పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోలీస్‌స్పోర్ట్స్, గేమ్స్ మీట్ శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్‌లు, ఆర్మ్‌డ్ రిజర్వ్, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డ్ విభాగాలకు చెందిన పోలీసు జట్లు ఉత్సాహంగా ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నాయి. పోలీసు అధికారులు, సిబ్బంది తమ హోదాలో తారతమ్యం లేకుండా ఉత్సాహంగా వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడా పోటీలను ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. నవంబరు 30తో పోటీలు ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐలు ఎస్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, శ్రీనివాసరావు, సీఐ లక్ష్మణరావు, ఆర్ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కియోస్క్ సేవలపై కినుకు!


రాజాం మండలం పెనుబాక ఆర్ఎస్‌కేలో దిష్టిబొమ్మలా కియోస్క్ మిషన్

- రైతు సేవా కేంద్రాల్లో దిష్టిబొమ్మల్లా కియోస్క్‌లు
- గత ప్రభుత్వంలో వీటికి అత్యంత ప్రాధాన్యత
- అందుబాటులో ఎరువుల స్టాక్, ధరల వివరాలు
- రైతులే నేరుగా కొనుగోలుచేసుకునే అవకాశం
- ఇందులోని సాఫ్ట్‌వేర్‌ను వీఏఏల మొబైల్‌కు లింక్‌చేసిన ప్రస్తుత సర్కారు
- స్టాక్, నగదు చెల్లింపులు వివరాలు మాయం



రేగిడి మండలంలోని నాయిరాలవలస రైతుసేవా కేంద్రంలో నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

రాజాం: రైతన్నకు సాగుభరోసా కొరవడుతోంది. సాయం అందించాల్సిన సర్కారు పొమ్మనలేక పొగబెడుతోంది. గత ప్రభుత్వం అందించిన సాయం నేడు అందకపోవడంతో వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతన్నకు సాగు కష్టాలు వెంటాడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు క్షేత్రస్థాయిలో సేవలందించింది. సీజన్‌లవారీగా పంటల సాగుకు పెట్టుబడి అందించేది. రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్ మిషన్ల ద్వారా కావాల్సిన ఎరువులు, పురుగు మందులను రైతులే బుక్‌చేసుకునేవారు. రైతుకు సాగుపై ఆసక్తితో పాటు ఆర్థిక అక్షరాస్యత పెరిగేది. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. పేరుకే సేవ తప్ప అందులోని సేవలన్నీ కనుమరుగయ్యాయి. రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ మిషన్లు నేడు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

సాఫ్ట్‌వేర్‌ను డంప్‌చేస్తూ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు అందుబాటులోకి తెచ్చిన కియోస్క్ మిషన్లు ఎంతో విలువైనవి. జిల్లాలో 501 రైతు సేవా కేంద్రాల్లో ఇవి రైతులకు విలువైన సేవలు అందించేవి. రైతే స్వయంగా మిషన్ వద్ద నిలబడి తనకు కావాల్సిన సాగు పరికరాలు, ఎరువులు, పురుగుమందులకు ఆర్డర్ ఇవ్వడంతో పాటు అక్కడే నగదుచెల్లించి రశీదుపొందే అవకాశం ఉండేది. ఏటీఎంలను పోలిన ఈ మిషన్ల ద్వారా సరికొత్త వ్యవసాయ సాంకేతిక విధానం అందుబాటులో ఉండేది. ఎటువంటి దళారీ పెత్తనానికి, అధిక చెల్లింపులకు అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం ఈ సేవల కోసం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. కియోస్కో యంత్రాల్లోని సాఫ్ట్‌వేర్‌ను వీఏఏల ఆండ్రాయిడ్ మొబైల్స్‌కు అనుసంధానం చేశారు. ఏ వివరాలు కావాలన్నా రైతులు వీఏఏలను మాత్రమే సంప్రదించాలి. ఎంత స్టాక్ ఉంది... అసలు ఎరువులు ఉన్నాయా లేదా అన్నది రైతుకు నేరుగా వాటి ధరలు కూడా తెలియరావడం లేదు. వీఏఏలకే నగదుచెల్లించి ఎరువులు పొందాల్సిన పరిస్థితి. ఫలితంగా కొన్నిచోట్ల మోసపోయే అవకాశం ఉందన్న భావనతో రైతులు ప్రైవేట్ షాపులను ఆశ్రయిస్తున్నారు. సాగు అవసరాలు తీర్చుకుంటున్నారు.


గతంలో రైతు సేవాకేంద్రాల్లోనే...



గతంలో రైతు సేవా కేంద్రం వద్ద ఖరీఫ్, రబీల్లో ఎరువులు కొనుగోలుచేశాం. ఇక్కడ పెద్ద మిషన్ ద్వారా మాకు వివరాలు తెలిసేవి. ధరలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ఆ మిషన్లు మా రైతు సేవా కేంద్రంలో పనిచేయడం లేదు. ఏ వివరాలు అందులో లేవు.

– తూముల నారాయణరావు, రైతు, కొత్తవలస, వంగర మండలం


అంతా అయోమయం



గతంలో వ్యవసాయం పండగలా ఉండేది. రైతు భరోసా కింద పంటల పెట్టుబడికి డబ్బులు అందేవి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఆర్బీకేలలో లభించేవి. ఇప్పుడు అక్కడ మిషన్లు పనిచేయడం లేదట. వీఏఏలు వారి ఫోన్ల ద్వారా బుక్‌చేస్తున్నారు. వీటి కంటే ప్రైవేట్ దుకాణాలే మంచిదనిపిస్తుంది.

– బివర ఆనందరావు, రైతు, వన్నలి, రేగిడి మండలం

అందుబాటులో ఉన్నాయి..



కియోస్కో మిషన్లు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. వాటి సాఫ్ట్‌వేర్ లింక్ అయా కేంద్రాల వీఏఏల ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో ఉన్నాయి. అందులో స్టాక్ వివరాలు తెలుస్తున్నాయి. రైతులు వారి వద్ద ఈ సేవలు పొందవచ్చు. కియోస్క్‌ల వినియోగ పరిజ్ఞానం గ్రామాల్లో పెద్దగా లేకపోవడంతో వాటి వినియోగం తక్కువగా ఉంది. ప్రైవేట్ వ్యాపార సంస్థల వద్దే రైతులు ఎక్కువగా ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు ఆసక్తిచూపుతున్నారు.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం